కోరుకున్న చోటే హైస్కూల్ నిర్మాణం

- రాయపాలెం వాసులతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి
- ఉత్సాహంగా 'గడప గడపకు మన ప్రభుత్వం'


రాయపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: ప్రజలు కోరుకున్న చోటే హైస్కూల్ నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. రాయపాలెంలోనే జీవీఎంసీ హైస్కూల్ పునర్నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా రెండోవార్డులోని రాయపాలెంలో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ 70ఏళ్ల క్రితం ప్రాథమిక పాఠశాలగా ప్రారంభమై, హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయిన పాఠశాలలో 200మంది విద్యార్థులు ఉండేవారన్నారు. తరగతి గదులు చాలవన్న కారణంతో హైస్కూల్‌ను అయిదేళ్ల క్రితం బ్యాంకు కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి మార్చారని చెప్పారు. అయితే చిల్లపేట, జీరుపేట, మూలకుద్దు, నమ్మివానిపేట, రేఖవానిపాలెం తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు అంత దూరం వరకు వెళ్లలేకపోతున్నారని తెలిపారు. స్థానిక విద్యార్థులకు అందుబాటులో ఉంటుందనే, తమ గ్రామానికి చెందిన సకల అప్పలస్వామి కుటుంబీకులు పాఠశాలకు ఉచితంగా స్థలం ఇచ్చారని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ హైస్కూల్‌కు రూ.88 లక్షలు మంజూరయ్యాయని, ప్రజలు కోరుకున్న చోటే హైస్కూల్ నిర్మిస్తామని స్పష్టం చేశారు.

ఏటా 32 సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ ప్రతి ఏటా సంక్షేమ క్యాలెండర్ ప్రకారం 32 పథకాలను అవినీతికి తావు లేకుండా ప్రజలకు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.అంగన్‌వాడీకి సర్వే నంబర్ 112లో మూడు సెంట్లు స్థలం కేటాయిస్తామని చెప్పారు. ఈ మూడేళ్లలో గ్రామానికి చెందిన 191 కుటుంబాలకు గాను 154 కుటుంబాలకు రూ.1.57 కోట్ల సంక్షేమ పథకాలు అందించామని వివరించారు. గ్రామకంఠంలో గెడ్డల ఆక్రమణపై దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ గ్రామదేవతలైన నూకాలమ్మ, మరిడమ్మ ఆలయాలకు వెళ్లేందుకు రహదారి నిర్మించాలని కోరారు. గ్రామానికి చెందిన శిరిగుడి నూకరాజు మాట్లాడుతూ రెండు సార్లు హెర్నియా శస్త్రచికిత్సకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25,656 అందించిందన్నారు. పూతి గుణ మాట్లాడుతూ ఈ మూడేళ్లలో రూ.3.84 లక్షల లబ్ధి కలిగిందని తెలిపారు. కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, భీమిలి తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, జెడ్సీ బి.రాము, రెండోవార్డు ఇన్‌చార్జి శిల్లా నరశారాణి, అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, శిల్లా కరుణాకరరెడ్డి, శీరపు శ్రీరాములు, జీరు సుజాత, భాగం స్వాతి సుధాకర్, ఎరుసు అప్పారావు, తోణంగి ఎల్లాజీ, సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో మహిళా మార్టు

- డ్వాక్రా మహిళల భాగస్వామ్యంతో ఏర్పాటు
- నిర్మాణం ప్రారంభం


నిర్మాణ పనులు జరుగుతున్న మహిళా మార్టు

ఆనందపురం : మహిళలను వ్యాపార రంగంలో స్థిరపరచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా మార్టుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఆనందపురం మండలానికి మహిళా మార్టు మంజూరు కాగా, మండల కేంద్రం వద్ద నిర్మిస్తున్నారు. అక్కడ ఉన్న మహిళా ప్రగతి కేంద్రం పూర్తిగా శిథిలం కావడంతో, దాన్ని తొలగించి మహిళా మార్టు నిర్మాణానికి కేటాయించారు. దీంతో ఇటీవల పనులు ప్రారంభించారు. మార్టును పూర్తిగా డ్వాక్రా మహిళల భాగస్వామ్యంతోనే ఏర్పాటు చేస్తున్నారు. వివిధ గ్రామాలలో ఉన్న 15,270 మంది డ్వాక్రా మహిళలు ఒక్కొక్కరు రూ.310 చొప్పున సమకూర్చారు. అందులో బిల్డింగ్ ఫండ్ కింద రూ.100 మూలధనం వాటా కింద రూ.200, సభ్యత్వం కింద రూ.10 చొప్పున కేటాయించారు. మొత్తంగా బిల్డింగ్ ఫండ్ కింద రూ.15.27 లక్షలు, మూలధనం కింద రూ.30.54 లక్షలు, సభ్యత్వం కింద ర.1.52 లక్షలు చొప్పున సమకూరింది. ఈ మేరకు భవన నిర్మాణ పనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ఇందిరా క్రాంతి పథం ఏపీఎం నాగభూషణరావు మాట్లాడుతూ మహిళా మార్టు నిర్మాణం పూర్తి అయిన వెంటనే మూలధనం రూ.30.54 లక్షలతో మహిళలు వ్యాపారం ప్రారంభిస్తారని చెప్పారు. అందులో వచ్చిన లాభాలు మూలధనం సమకూర్చిన మహిళలకు వాటాల వారీగా పంచుతామన్నారు. మహిళా మార్టు నిర్వహణను డ్వాక్రా మహిళలే నిర్వహిస్తారని వివరించారు.

క్లుప్తంగా

ఐనాడలో రామాలయం నిర్మాణం


నిర్మాణంలో ఉన్న రామాలయం

పద్మనాభం: మండలంలోని ఐనాడలో రామాలయ నిర్మాణం చకచకా సాగుతోంది. విరాళాలు సేకరించి, సుమారు రూ.45 లక్షలతో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. పాత రామాలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో వర్షాలకు కారిపోతుండేది. దీంతో ఈ ఆలయాన్ని పడగొట్టి, ఆ స్థానంలోనే కొత్త ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే శ్లాబు వేసి గోపురం నిర్మించారు.

పందుల స్వైర విహారంతో పాట్లు


చంద్రంపాలెంలో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న పందులు

మధురవాడ: జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం వలన వీధుల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. చంద్రంపాలెం, స్వతంత్రనగర్, ఆర్‌జీకే కాలనీ, వాంబేకాలనీ, ప్రియదర్శిని కాలనీ, గణేష్‌నగర్ తదితర ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా పందులు స్వైర విహారం చేయడంతో పాటు కొన్ని చోట్ల ఇళ్లలో కూడా చొరబడుతున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు పందుల నిర్మూలనపై మాటలకే పరిమితం అవుతున్నారని, కనీసం ఉన్నతాధికారులైనా స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


స్థానికులతో మాట్లాడుతున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము

కొమ్మాది: ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. అప్పుడే వ్యాధులు దరి చేరవని జోన్–1 కమిషనర్ బొడ్డేపల్లి రాము అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ, రెడ్డీలపాలెం, సోమన్నపాలెం ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. డ్రైనేజీలు, రోడ్లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని శానిటరీ వర్కర్లకు సూచించారు. నివాసాల మధ్య చెత్త వేయకుండా చెత్త సేకరణ వాహనం వచ్చినప్పుడు తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి అందించాలని స్థానికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎరుసు అప్పలకొండరెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు


విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న నాయకులు

ఆనందపురం : మండలంలోని కల్లివానిపాలెంలో సంక్రాంతి సందర్భంగా కేవీపీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో పాలవలస జట్టు విజేతగా, లొడగలవానిపాలెం జట్టు రన్నర్‌గా నిలిచాయి. ఈ మేరకు మండల ఉపాధ్యక్షులు బొట్టా ధనలక్ష్మి రామకృష్ణ, సర్పంచ్ వానపల్లి ముత్యాలరావు తదితరులు విజేతలకు ట్రోఫీ, షీల్డ్, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోయి వెంకట రమణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉప్పాడ సూరిబాబు, రౌతు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గుట్టలుగా వ్యర్థాలు

- రోడ్డు పక్కనే డంపింగ్
- దుర్గంధంతో ప్రయాణికుల అవస్థలు


రోడ్డు పక్కనే పారబోసిన కోళ్ల వ్యర్థాలు


రోడ్డు పక్కనే పడేసిన కొబ్బరి బొండాలు

ఆనందపురం: వ్యాపారులు వ్యర్థాలను రోడ్డు పక్కన విచ్చలవిడిగా పడేయడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆనందపురం జంక్షన్ నుంచి పెందుర్తి వెళ్లే సర్వీసు రోడ్డు పక్కన వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయి ఉన్నాయి. ఆ ప్రాంతంలోనే పెందుర్తి వెళ్లే ప్రయాణికులు నిరీక్షిస్తుంటారు. ఆనందపురం జంక్షన్‌తో పాటు పరిసర ప్రాంతాలలో వ్యాపారులు చేస్తున్న వారు చికెన్ సెంటర్లను నిర్వహిస్తున్న వారు, కొబ్బరి బొండాలు, ఇతరత్రా వ్యాపారాలు చేసే వారు వ్యర్థాలను నేరుగా తీసుకువచ్చి రోడ్డు పక్కనే పడవేస్తున్నారు. ముఖ్యంగా వ్యర్థాలను వేయడంతో అక్కడికి కోళ్లు, పందులు చేరి గందరగోళంగా ఉంటోంది. కోళ్ల వ్యర్థాలు కుళ్లి విపరీతమైన దుర్వాసన వ్యాపించడంతో, బస్సుల కోసం నిరీక్షిస్తున్నవారు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు దివీస్ సాయం



బాధిత కుటుంబానికి ఇటుకలు, సిమెంట్ అందిస్తున్న దివీస్ ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీలో ఇటీవల అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయిన కోనాడ గురువులు కుటుంబానికి దివీస్ లేబరేటరీ యాజమాన్యం రూ.98వేల విలువైన ఇటుకలు, సిమెంట్‌ను బుధవారం అందించింది. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోనాడ నూకరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మేరుగ ఎల్లాజీ మాట్లాడుతూ దివీస్ యాజమాన్యానికి బాధిత కుటుంబం తరఫున ధన్యవాదాలు తెలియచేశారు. కార్యక్రమంలో దివీస్ సీఎస్ఆర్ ప్రతినిధులు ఇ.ఎస్.నాగరాజు, కె.నరసింహారావు, మత్స్యకార నాయకులు సురపతి అప్పలరాజు, ముసలయ్య, పంచాయితీ కార్యదర్శి దుర్గాప్రసాద్, వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష


జీవీఎంసీ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సీతమ్మధార: భీమిలి నియోజకవర్గం మధురవాడ జోన్–2కు సంబంధించిన అభివృద్ధి పనులపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం సీతమ్మధారలోని ఆయన నివాసంలో జీవీఎంసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు విన్నవించుకున్న సమస్యలపై చర్చించారు. సీసీ రోడ్లు, విద్యుత్, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలు లేకుండా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగో వార్డు మధురవాడకు ఏలేరు కాలువ నీరు అందించాలని, గోస్తనీ నది పైప్‌లైన్ పనులు మార్చి నాటికి పూర్తి చేయాలని, తుమ్మిగుడ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉండటం వల్ల స్టోరేజ్ వాటర్ ట్యాంకులా అభివృద్ధి చేద్దామంటే సమస్య పరిష్కరించలేకపోతున్నామని, అటవీ శాఖ అధికారులతో మాట్లాడి స్థానికులకు తాగునీరు అందించేలా చూడాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా అభివృద్ధి చేయాలన్నారు. పార్కులు, రోడ్లు, వాటర్ ట్యాంక్‌లతోపాటు ఇతర అభివృద్ధి పనులు చకచకా జరగాలని ముత్తంశెట్టి సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ(నీటి సరఫరా) రవి, మధురవాడ జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఈఈలు, డీఈలు, ఏఈలు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

గౌరవ డాక్టరేట్‌కు సామవేదం ఎంపిక


సామవేదం బాలసుబ్రహ్మణ్యం

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామానికి చెందిన సామవేదం బాల సుబ్రహ్మణ్యం యూఎస్ఏకు చెందిన ఆసియా వేదిక్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. కళలు, సామాజిక రంగాలకు చేసిన సేవలను గుర్తించి ఈ డాక్టరేట్‌కు బాల సుబ్రహ్మణ్యంను ఎంపిక చేశారు. 40 ఏళ్ల నుంచి పౌరాణిక రంగస్థల నటుడిగా పలు పాత్రలు పోషించారు. పురోహితునిగా 50 ఏళ్ల నుంచి సేవలందిస్తున్నారు. ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో పౌరాణిక రంగంలో 4 వేల ప్రదర్శనలు ఇచ్చారు. ఐదు వందల పరిషత్తుల్లో నిర్వహించిన నాటక పోటీల్లో పాల్గొని 20కి పైగా విభిన్న పాత్రలు పోషించారు. ఇంత వరకు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో 20కి పైగా అవార్డులు అందుకుని సత్కారాలు పొందారు. వీటిని పరిగణనలోకి తీసుకుని ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్శిటీ బాల సుబ్రహ్మణ్యంను గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. ఇతనికి హైదరాబాద్‌లోని సరస్వతీ భవన్‌లో అవార్డు ప్రదానం చేస్తారు.

బకాయిల వసూలుకు చర్యలు


ఇంటక్ అధ్యక్షుడు వరహాలరాజును సన్మానిస్తున్న కార్మికులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్ మిల్లు యాజమాన్యం నుంచి కార్మికులకు రావలసిన మిగిలిన బకాయిలు త్వరగా అందేలా చూద్దామని మిల్లు గుర్తింపు సంఘం ఇంటక్ నాయకులు బుధవారం తీర్మానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఇంటక్ ఆఫీసు బేరర్లు, కార్మికులు అధ్యక్షుడు కాకర్లపూడి వరహాలరాజుతో మాట్లాడుతూ మిల్లు యజమాని బజోరియాకు ఫోన్ చేసి కార్మికులు పడుతున్న ఇబ్బందులు తెలియజేయాలన్నారు. దీనిపై ఆయన అంగీకారం తెలిపారు. జ్యూట్‌మిల్లు మూత సమయంలో దేశంలో మిగిలిన మిల్లుల కంటే చిట్టివలసలో ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులకు తమకు సాధ్యమైనంతలో న్యాయం చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయనను బేరర్లు, కార్మికులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి చిల్ల వెంకటరమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ జీరు వెంకటరెడ్డి, ఆఫీసు బేరర్లు సరగడ సూరిబాబు, బొడ్డు నరసింగరావు, కొయ్య సూరి గురువులు, సరగడ శ్రీరామమూర్తి, చిల్ల చిదంబరం, పూసర్ల నరసింగరావు, పోలిపల్లి ప్రకాష్, చుక్క పోలయ్యరెడ్డి, రిక్క నరిసింహ, పల్ల అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

దివంగత ఎన్టీఆర్‌కు ఘన నివాళి


పరదేశిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

మధురవాడ: దివంగత మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు ఎన్టీ రామారావు 27వ వర్ధంతిని మధురవాడలోని పలు చోట్ల టీడీపీ శ్రేణులు నిర్వహించాయి. ఇందులో భాగంగా పరదేశిపాలెంలో గల ఆయన విగ్రహానికి కార్పొరేటర్ ఎం. హేమలత, టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణ, బోయి శ్రీను, వాండ్రాసి అప్పలరాజు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలుగు జాతి ఔన్నత్యాన్ని నలు దిక్కులా చాటి చెప్పిన నాయకుడు రామారావు అని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మూడు కుటుంబాలకు వైఎస్సార్ బీమా


నామినీలకు బీమా సొమ్ము అందిస్తున్న దుర్గారావు

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీలో మూడు కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.లక్ష వంతున గ్రామ సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. ఇటీవల మరణించిన చిననాగమయ్యపాలేనికి చెందిన బొడ్డు దుర్గయ్య భార్య మారమ్మ, చెల్లపల్లి చిన ఎర్రయ్య కుమారుడు రవికుమార్, చెల్లపల్లి నరసింగరావు భార్య ఎల్లమ్మకు వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డు దుర్గారావు చేతుల మీదుగా ఈ మొత్తాన్ని అందించారు. తక్షణ సాయంగా నామినీలకు రూ.10వేల వంతున అందించి, మిగిలిన బీమా సొమ్మును వారి బ్యాంకు ఖాతాలలో ప్రభుత్వం ద్వారా నేరుగా క్రెడిట్ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో అడ్మిన్ శశికళ, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సన్మార్గానికి క్రీడలు దోహదం


క్రికెట్ జట్లకు ట్రోఫీలు అందిస్తున్న నిర్వాహకులు


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కార్పొరేటర్ హేమలత

మధురవాడ: యువతను సన్మార్గంలో నడిపించేందుకు క్రీడలు దోహదపడతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. బొట్టవానిపాలెం శివార్లలో సంక్రాంతిని పురస్కరించుకుని కొర్రాయి గోవింద్, నమ్మి అప్పలరాజుల జ్ఞాపకార్థం వారం రోజుల పాటు ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించిన బీవీపీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు బుధవారం ముగిసాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఎం. హేమలత విజేత బీవీపీ బుల్స్ జట్టుకు రు. 12,500, రన్నర్ జట్టు బీవీపీ రాయల్స్ స్ట్రైకర్స్‌కు రు. 7,500 చొప్పున నగదు బహుమతులు అందించారు. ఇతర విజేతలకు కూడా ఆమెతో పాటు నిర్వాహకులు, అతిథులు బహుమతులు అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా దాసరి రమణ, బెస్ట్ బౌలర్‌గా పవన్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా వంశీ నిలిచారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ముగిసిన సంక్రాంతి క్రికెట్ పోటీలు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయితీలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. ఇద్దిపల్లి నానాజీ, వాండ్రాసి సతీష్, తమ్మిన సురేష్, వాండ్రాసి అరవింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో పది జట్లు తలపడ్డాయి. ఈ పోటీల్లో విన్నర్‌గా పాత ఊరు ఎ జట్టు, రన్నర్‌గా కొత్త ఊరు ఎ జట్టు నిలిచాయి. వీరికి నిర్వాహకులతో పాటు తమ్మిన ఆనంద్, ఇద్దిపల్లి రమేష్, పొట్నూరు వాసు, పొట్నూరు సూరిబాబు తదితరుల చేతుల మీదుగా ట్రోఫీలు అందించారు.

మరింత మెరుగ్గా బోధన

ఏయూక్యాంపస్: అధ్యాపకులు 21వ దశాబ్దపు నైపుణ్యాలు, బోధన పద్ధతులపై విస్తృత అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ సూచించారు. ఏయూ హెచ్ఆర్‌డీసీ కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, కామన్వెల్త్ ఎడ్యుకేషనల్ మీడియా సెంటర్ ఫర్ ఏషియా, ఏయూ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అధ్యాపకులు నూతన విద్యా విధానంలో వచ్చిన మార్పులను అవగాహన చేసుకుంటూ విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. మాస్టర్ ట్రైనర్ దినకర్ రెడ్డి, విశిష్ట అతిథి హెచ్ఆర్‌డీసీ సెంటర్ సంచాలకుడు ఆచార్య టి.వికృష్ణ, కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య ఎస్.ఎ.డి.పాల్ తదితరులు ప్రసంగించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని వివిధ కళాశాలలకు చెందిన 55 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా పోలమాంబ పరస మహోత్సవం


పూజలందుకున్న పోలమాంబ అమ్మవారు


మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతుల్లో కరకచెట్టు పోలమాంబ ఆలయం

ఏయూక్యాంపస్: శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక పరస మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. నగరంలోని 14 గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీరామ పట్టాభిషేకం, భజనచెట్టును భక్తజన సందోహం ఊరేగింపుగా తీసుకువచ్చారు. పెదవాల్తేరు నుంచి పోలమాంబ ఆలయానికి వీటిని స్థానికులు ఊరేగింపుగా తోడ్కొని వచ్చారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భజన బృందాలు, కోలాటం, తప్పెటగుళ్లు, గరిడీలు అమ్మవారి ఆలయం వద్ద పండగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పోలమాంబను దర్శించుకున్నారు. పంచామృతాభిషేకాలతో వేడుకలను ప్రారంభించారు. అనంతరం మండపంలో ప్రత్యేక కుంకుమ పూజలు జరిపారు. మూడు రోజుల సంక్రాంతి పండగకు కొనసాగింపు అన్నట్లుగా పోలమాంబ పరస మహోత్సవం కన్నులపండువగా జరిగింది. ఆలయ ప్రాంగణాన్ని పూలమాలలు, విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. పరస సందర్భంగా దేవాలయం నుంచి పెదవాల్తేరుకు వెళ్లే మార్గంలో ఇరువైపులా చెరకుగడలు, చిన్నారుల ఆటవస్తువులు, వివిధ గృహాలంకరణ వస్తువులను చిరు వ్యాపారులు విక్రయించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వి.ఎస్.సురేష్‌బాబా, ఆలయ చైర్మన్ పి.శంకరరెడ్డి, ధర్మకర్తలు , 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మీ సురేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ సేవా సంఘం పెద్దలు, 14 గ్రామాల పెద్దలు పాల్గొని అమ్మవారిపై తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం


అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా విష్ణుసహస్ర నామ పారాయణ

ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో అర్చకులు, వేద పండితులు స్వామికి పూజలు చేసి హారతులు అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

విలక్షణ గ్రంథం విజయ విలాసం


మాట్లాడుతున్న సుబ్బారావు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో 'చేమకూర వెంకట కవి–కవితా చమత్కృతి' అనే అంశంపై సాహిత్య ప్రసంగ కార్యక్రమం జరిగింది. ముఖ్య వక్త, కవి, విమర్శకుడు సుబ్బారావు మాట్లాడుతూ తంజావూరు నాయక రాజుల్లో ముఖ్యుడు రఘునాథ నాయకుడి ఆస్థాన కవి చేమకూర వెంకటకవి అని అన్నారు. ఆయన రాసిన సారంగధర చరిత్ర, విజయ విలాసం అద్భుతమైన కావ్యాలని పేర్కొన్నారు. విజయ విలాసం విజయుడగు అర్జునుడు, ఉలూచి, చిత్రాంగద, సుభద్రల వివాహం, సరస శృంగార వర్ణనలతో శ్లేష ఉపయోగించి తెలుగు సాహిత్యానికి అలంకారమనదగిన గ్రంథాన్ని అందించారని కొనియాడారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ 17వ శతాబ్దానికి చెందిన చేమకూర వెంకటకవి రచించిన విజయ విలాసం విలక్షణమైన గ్రంథ మని పేర్కొన్నారు. కార్యక్రమంలో కవులు, రచయితలు డి.వి.సూర్యారావు, కె.జి.వేణు, కుప్పిలి భీమేశ్వరరావు, కొత్తూరి రమణ, పి.వి.ఆర్.కె.రావు ప్రసంగించారు.